

శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ఎడిటర్స్ : VAS ప్రసాద్, గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.
గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 09
సంచిక : 03

**నేపథ్యం:**
**గురు సేవ**

భాద్రపద పౌర్ణమి
సెప్టెంబర్ 7, 2025

పూజ్యశ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం

Mama Maya Duratyaya (Sir Warning)

సద్గురువును ఆశ్రయించడమంటే ఏమిటో వివరంగా సుబ్బరామయ్య సార్ వివరంగా చెప్తూ వెంకయ్యస్వామి దగ్గర ఎలా సేవ చేయాలో, ఎంత జాగ్రత్తగా ఉండాలో చెపుతున్నారు.


**అనేకజన్మ సంప్రాప్త కర్మబంధ విదాహినే!**
**జ్ఞానానల ప్రభావేన తస్మై శ్రీ గురవే నమః**


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

# విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం | 3 |
| భక్తుల అనుభవాలు | 12 |
| సార్ సత్సంగ గానం | 21 |
| శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు | 22 |
| సార్ సత్సంగం | 27 |
| మహాత్ముల వాక్యాలు | 31 |






శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దగ్గాస్వామి



సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్

# సంపాదకీయం

ఓం సాయిరాం

శ్రీ సుబ్బరామయ్య సార్ ఆరాధనా మహోత్సవం జూన్ 9 వ తారీఖున శ్రీ సార్ సమాధిమందిర ప్రాంగణంలో అంగరంగ వైభవముగా జరిగింది. శ్రీ సార్ అభిషేకము, పూజ, సత్సంగము, సార్ చే నిర్మింప బడిన కట్టడాల సందర్శనము, పల్లకీ ఊరేగింపు, ఆరతులతో ఎంతో హృద్యంగా జరుపబడింది. ఆ మహోత్సవంలో భాగంగా సద్గురు సేవలో మన తక్షణ కర్తవ్యము ఏమిటి? అని శ్రీ వేణుగోపాల్ గారు ప్రశ్నించగా సత్సంగ సభ్యులు పంచుకున్న సద్విషయాలు ఇచ్చట పొందు పరచుకొన్నాము.

## దమ్మపేట నాగేశ్వరరావు మాస్టారు

ఆరాధన అంటే "కృతజ్ఞత మహోత్సవం"! అంటే వారి పట్ల మన కృతజ్ఞతా భావాన్ని వ్యక్తపరచుకోవడం. దీనిని వ్యక్తపరచుకోవడానికి సార్ చెప్పినవి తలచుకొని ఆచరించేందుకు ప్రయత్నించాలి. ఈ ప్రయత్నం నిరంతరం చేయాలి.

సార్ దగ్గర నాకు బాగా నచ్చింది **సేవా కార్యక్రమం**. సార్ కి "అవధూత బోధమృతం"లో చెప్పినట్లు అటాచ్మెంట్ లేదు, డిటాచ్మెంట్ ఉంది. ఇది ఎలా అంటే? మనమైతే, మనకి తెలియని వారి ఇల్లు కాలిపోతుంది అని తెలిస్తే, (నీళ్ళు ఎద్దడిగా ఉంటే) బిందెడు నీళ్లు ఉన్నా, చెంచా కూడా పొయ్యము. అదే సార్ చెంచా నీళ్లు మాత్రమే ఉన్నా, వాటి తోటి ఆర్పే ప్రయత్నం చేస్తారు. వారికి తెలిసిన వాళ్లు, తెలియనివాళ్లు అనే భేదభావం ఉండదు. సార్ కి "ఎదుటివారు ఆపదలో ఉంటే ఏ విధంగానైనా సహాయం చేయాలి" అనే మనసు ఎప్పుడూ ఉంటుంది. ఎప్పుడైనా కొత్తవారితో మాట్లాడుతున్నా, వారితో పూర్వం తెలిసిన వాళ్ళుగా పూర్తిగా మమేకమై మాట్లాడేవారే గాని, "వీరు తెలిసిన వాళ్ళు, వాళ్లు తెలియని వాళ్ళు" అనే తారతమ్యం ఎరుగరు. ఆ కొత్త వాళ్లని సార్ తో మీకు ముందు పరిచయం ఉందా? అని అడిగితే, లేదు ఇదే మొదటిసారి అని చెప్పేవారు. అలా సార్ అందరితో ప్రేమతో మాట్లాడేవారు.

**నిరంతర శ్రమ:** స్వామి పూజకు సార్ రాత్రి రెండున్నర గంటలకు వెళ్ళవలనంటే ముందుగానే లేచి, కట్టెల పొయ్యి పైన వేడి నీరు తయారు చేసుకుని, స్నానం చేసి వెళ్లేవారు. పూజ నుంచి వచ్చిన తర్వాత సాయి మాస్టర్ నిలయంలో ఉదయ హారతి అయిన తర్వాత వచ్చిన భక్తులతో కొద్దిసేపు మాట్లాడేవారు. తర్వాత మరల స్వామి దగ్గరకు 10:30 గంటలకు మధ్యాహ్న పూజకు వెళ్లేవారు. తర్వాత మరల సాయిమాస్టర్ నిలయంలో మధ్యాహ్న హారతికి హాజరయ్యేవారు. సాయంత్రం నాలుగు గంటలకు బ్రహ్మంగారిమఠం వద్దకు సత్సంగానికి ఎండలో నడిచి గాని, సైకిల్ మీద గాని సుమారు 70 సంవత్సరాల వయస్సులో కూడా వెళ్లేవారు. సత్సంగం నుంచి వచ్చిన తర్వాత మరల 6 గంటలకు సాయంత్రం హారతి కి వచ్చేవారు. మధ్యలో ఎవరైనా భక్తులు వస్తే స్వామి గురించి, మాస్టారు గురించి, స్వామి సేవకుల గురించి ఎంతోసేపు చెప్పేవారు. అంతేకాకుండా ఎవరైనా సార్ తో వారి బాధల గురించి చెప్పుకుంటే ఆ బాధలు తీరే మార్గం చెప్పేవారు. **ఇలా నిరంతరం సార్ తన దగ్గరకు వచ్చిన వారిని స్వామియే ఆ రూపంలో వచ్చారని వారిని తృప్తి పరిచేవారు.**

**ఆచరణాత్మకమైన ఆధ్యాత్మికము:** సార్ విద్యానగర్లో ఉన్న స్థలం అమ్మి ఆ వచ్చిన డబ్బుతో సాయి మాస్టర్ నిలయాన్ని కట్టించారు. ఆ డబ్బును తన పిల్లల కోసం కూడబెట్టుకోకుండా ఆ వచ్చిన డబ్బుతో సాయి

మాస్టర్ నిలయాన్ని కట్టించడం ఎంతో గొప్ప సేవ. ఇది ఆచరణాత్మకమైన ఆధ్యాత్మిక భోధ. దీనిని చూసి మనం కూడా మనకి చేతనైన సహాయాన్ని ఆచరించమంటున్నారు. మనము అన్నీ సమృద్ధిగా ఉండినా ఇంకా మన పిల్లలకు ఎంతో కొంత కూడ పెట్టాలని చూస్తుంటాము. కానీ సార్ తన పిల్లల కోసం ఇంకా కావాలి, ఇంకా కావాలి అని చూడకుండా, అవసరమైనవి చేసి అంతా స్వామి మీద భారం వేసి ఇతరులకు శాయశక్తుల సహాయం చేశారు.

"సాయిమాస్టర్ నిలయం" నిర్వహణ పద్ధతి చాలా సులభంగా ఉంటుంది. ఎలా అంటే నేను ఇక్కడకు రాత్రి 11 గంటల 35 నిమిషాలకు వచ్చాను. నాకు రెండు నిమిషాల్లో లాకర్ ఇవ్వటం అయిపోయింది. నేను పడుకొని నిద్రపోయాను. అదే ఎక్కడైనా ఆశ్రమంలలో రూమ్ అలాట్మెంట్ కి రెండు గంటల టైం పడుతుంది. ఇక్కడ ఆశ్రమంలో లాకర్ల ఇవ్వటానికి ఎటువంటి డబ్బు తీసుకోరు. ఇక్కడ అన్ని పూర్తిగా ఉచితం. అలాగే చిన్న పిల్లలకు చదువుకోటానికి స్కూల్ కట్టించి అన్నీ పూర్తిగా ఉచితంగా బోధిస్తున్నారు.


**సాధారణత్వం:** ఒకసారి దమ్మపేట నుంచి నాతో పాటు నలుగురు గురు బంధువులు సార్ ని చూడడానికి బ్రహ్మంగారి మఠం వద్దకు వచ్చారు. అప్పుడు సార్ ఐదు ఇటుకలు తీసుకొని వస్తున్నారు. అప్పుడు ఆ గురు


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టార్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

బంధువులు సుబ్బరామయ్యసార్ ని చూపించమన్నారు. ఎవరు వారు? అని అడిగితే ఆ ఇటుకలు మోస్తున్న వారే సుబ్బరామయ్య సార్! అని వాళ్లకు చెప్పాను. అప్పుడు వాళ్లు సార్ అని చెప్పారు కదా? వారు ఇటికలు మోసే ఆయనా? అని అడిగారు. సార్ వేసుకున్న బట్టలు కూడా చాలా పాతవిగా ఉన్నవి. అంటే సార్ ఎంతో సాధారణంగా జీవించారు. అలానే ఎవరైనా భక్తులు సత్సంగానికి ఆలస్యంగా వస్తే వారి చూపుతోనే టైంకి రావాలని హెచ్చరించేవారు. దానివలన సార్ కి ఏమీ లాభం లేకపోయినా, మనం ఏమీ కోల్పోకూడదని ఆయన భావం. కనీసం పుణ్యస్థలాలకు, మహనీయుల దగ్గరకు వచ్చినప్పుడైనా కాలాన్ని సద్వినియోగం చేసుకోమని హెచ్చరిస్తున్నారు. మహనీయుల దగ్గరికి వచ్చినప్పుడన్నా మన ఆలోచనలు మాని, మానసికంగా కూడా వారికి దగ్గర అవ్వటానికి ప్రయత్నించాలి. ఆత్మ పరిశీలన నిష్కర్షగా చేసుకోవాలి. ఒకసారి మా స్కూల్లో కొత్తగా జాయిన్ అయిన టీచర్ పిల్లలకు పాఠాలు సరిగా చెప్పక, కాలాన్ని వృధా చేస్తున్నారు. నేను "తీసుకునే జీతానికి న్యాయం చేయాలి. పిల్లలకు సరిగా పాఠం చెప్పకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయి" అని చెప్పాను. అప్పటినుంచి ఆ టీచర్ నాతో ముభావకంగా ఉండేవారు. తర్వాత వారికి ప్రమోషన్ల సమయంలో ఇబ్బందులు వచ్చి సరిగా పాఠాలు చెప్పనందున సబ్జెక్టు సరిగా రాలేదు. అప్పుడు నేను (నాగేశ్వరావు మాస్టారు) చెప్పిన

విషయం గుర్తుకు వచ్చి అప్పటి నుంచి పాఠాలు సరిగా చెప్పేవారు. **కాబట్టి మనం చేసే ప్రతి పని మంచిదా? చెడ్డదా? అని ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అలా సమయం సద్వినియోగం చేసుకుంటే స్వామి ఆరాధన చేసినట్లు అవుతుంది, ఆచరణలోకి వస్తుంది.** బాబా చెప్పినట్లు మన సంచికి చిల్లులు లేకుండా చూసుకోవాలి. మాస్టర్ గారు చెప్పినట్లు రెండు గుంజలు భూమిలో పాతిపెట్టి రోజూ ఒక గుంజను కదిలిస్తూ ఉంటే ఏదో ఒక రోజుకు దానిని భూమిలో నుంచి తీయగలం. కానీ కదిలించని గుంజను తీయలేము. అలాగే మనం మంచి పనులను, సార్ చెప్పిన పనులను ప్రయత్నిస్తూ ఉంటే అప్పుడు మనము ఆచరణలోకి వస్తాము. లక్ష్యాన్ని చేరుతాము. ఈ పనులను చేసేటప్పుడు కర్తృత్వంతో కూడిన భావం ఉండకూడదు. భగవంతుడే నాకు ఈ శక్తినిచ్చి చేయిస్తున్నారు అని నిరంతరం గుర్తుపెట్టుకుని చేయాలి.

సార్ దగ్గర నుంచి మనం ముఖ్యంగా నేర్చుకోవాల్సింది **త్యాగబుద్ధి**. ఎంతో కొంత త్యాగం చేయాలి. గురజాడ అప్పారావు గారు చెప్పినట్లు “సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి తోడుపడవోయ్”. గురువు ఎప్పుడూ మన కష్టాలలో తోడు ఉండి నడిపిస్తారు. గురువు గొప్పతనాన్ని హృదయం నిండా నింపుకొని నిష్కామకర్మగా సేవ చేస్తుంటే మనం నిజంగా ఆరాధనలో పాల్గొన్న వాళ్ళం అవుతాము.

## పెద్ద ధర్మం ముందు చిన్న ధర్మముతో వ్యవహరించుట

సార్ చూచి నేర్చుకో పుస్తకంలో తన అనుభవమును ఇలా ఉటంకించారు. సుమతి అక్క ఉద్యోగ నిమిత్తం ధ్రువీకరణ పత్రం అందజేయాలి. దానికి ఒకేరోజు గడువు ఉండి గవర్నమెంట్ ఆఫీస్ కి వెళ్ళినప్పుడు అక్కడ కొందరు ముందుగా ప్రయత్నించి ఎదురుచూస్తున్నారు. వారు సార్ ని చూసి ఎప్పటినుంచో ప్రయత్నించి దానికోసం ఎదురు చూస్తున్నాం, ఇంకా ఇవ్వలేదు ఇప్పుడు వచ్చి కావాలంటే అవ్వదు అని చెప్పారు. అప్పుడు సార్ వారితో ఏమీ మాట్లాడక ఆ పక్కన ఉన్న గుమస్తాని పిలిచి నీకు ఎంత కావాలో చెప్పు కానీ నాకు ఈ పత్రంపై సంతకం కావాలి అని అడిగారు. ఆయన ఒక్క మాట మాట్లాడక దానిని తీసుకొని వెళ్లి సంతకం చేయించి ఇచ్చారు. ఇక్కడ స్వామివారు ఈ పని వెంటనే అవ్వాలంటే ఈ విధంగా నడిపించారని ఇక్కడ ఇంకనూ హిరణ్యకశిపుడు ప్రహ్లాదులను ఉదాహరణగా తండ్రి మాట పాటించాలనే ధర్మం కంటే భగవంతుని విస్మరించ కూడదనే ధర్మం ముఖ్యం అని చెప్పారు.

**గొర్తి రవి గారు ఇలా చెప్తున్నారు**. నేను పది రోజుల నుంచి మాస్టర్ E.K వారి సహజీవన యోగ తరగతి మరియు వారి స్పిరిచువల్ ఆస్ట్రాలజీ పుస్తకాలని చదువుతున్నాను. వాటి నుంచి కొన్ని విషయాలు,


పరిణామక్రమంగా మొక్కలు, పక్షులు, జంతువులు తర్వాత మనుషులు పుట్టారని మానవుడు ఈ కింద కక్షలలో తన నడవడి దాని యొక్క మార్పులు పై ఆధారపడి పరిణితి క్రమం ఉంటుందని ఈ విధంగా ఉదహరించారు

1. ఇండివిడ్యువాలిటీ (individuality) లెవెల్ : ఈ పరిణితిలో మానవుడు తనకు కావలసినవి తను పొందవలసినవి - వాటి చుట్టూ నడవడి ఉంటుంది.
2. పర్సనాలిటీ (personality) లెవెల్: ఈ పరిణితిలో ఇతరులతో తను బాగా ఉంటే వాళ్ళు తనతో బాగా ఉంటారని - ఆ భావం చుట్టూ నడివడి ఉంటుంది.
3. సోల్ (soul) లెవెల్: ఇది సహజీవనం. తమ ఆంతర్యంలో తమకు అన్యం లేని స్థితిని అనుభవిస్తూ, క్రియారూపంలో తోటివారి ఉద్ధరణకు కృషిచేస్తూ ఉంటారు. ఈ పరిణితిలో వాళ్లు పైనున్న గురువులకు సేవకులుగా వచ్చి అందరి ఉన్నతికి సహాయపడతారు. వీరిలో అందరి యందు భగవంతుని చూడడం, ప్రేమ తత్వం సహజమై ఉంటుంది.


శ్రీ షిర్డీ సాయిబాబా

శ్రీ భరద్వాజ మాస్టర్

శ్రీ సుబ్బరామయ్య గారు

శ్రీ వెంకయ్యస్వామి

శ్రీ దత్తాస్వామి

## భక్తుల అనుభవాలు

**వేణు గోపాల్ గారు:**

వేణు సార్ కల్పాకం నుండి రైల్లో వస్తూ మద్రాస్ రైల్వే స్టేషన్ లో సార్ కి “ఎప్పుడూ ఏమీ తీసుకు వెళ్ళలేదు, ఇవాళ తీసుకెళ్దాం” అని ఆపిల్ పండ్లు కొన్నారు. ఏమీ చెప్పకుండానే గొలగమూడిలో సార్ చేయి చాపి ఆ ఆపిల్ పండ్లు తీసుకున్నారు.

మరో సారి వేణు సార్ ఇంట్లో జామ చెట్టు మొదటి కాయ ఇద్దామని కోసారు. సార్ మెయిన్ రోడ్డు నుండి వేణు సార్ ఇంట్లోకి వచ్చి చేయి చాపి జామకాయ తీసుకుని తినేశారు. **శ్రీ సార్ సర్వజ్ఞులు ! భక్తికి బందీ !**

**గొర్తి రవి :**

అందరిలో భగవంతుని చూసేవాళ్ళని భగవత్ స్వరూపంగా భావించ దగినవారని అట్టివారు మన సుబ్బరామయ్య సార్ అని చెబుతూ తను తొలిసారి అనగా 1996 తన తండ్రితో కలిసి గొలగమూడి వచ్చుట, అప్పుడు సార్ వెంకయ్య స్వామి వారి గుడి పక్కన చిన్న రేకుల ఇంట్లో ఉండేవారు. ఆ చిన్న ఇంట్లోనే భక్తులు వాళ్ళ చెప్పులు బ్యాగులు సామాన్లు పెట్టుకునేవారు. అది మొదటిసారి అయినప్పటికీ సార్ ఎంతో ప్రేమతో స్వామి వారి గురించి రెండు మూడు గంటలు చెప్పారు. అది వారి ప్రేమ తత్వానికి నిదర్శనం.

వారికి తన నుండి  పొందేది ఏమీ లేదు, కేవలం నా ఉన్నతి కోసమే సార్ తన కాలాన్ని పంచారు.

ఇంకా ఇలా చెబుతున్నారు: సార్, గురువుగారు ఎప్పుడు, ఎవరిపైన కోపగించినా, ఎవరినైనా కోపగించినట్టు కనబడినా అది అవతలి వారి మేలుకొరకే. రోడ్డుపై పరిగెడుతున్న పిల్లవాడిని తండ్రి మందలించినట్లు. సార్ మనల్ని పర్సనాలిటీ లెవెల్ నుంచి ఇండివిడ్యువల్ లెవెల్ కి ఇంకా పైకి భగవంతుని వైపుకి నడిపించుటకే సార్ ప్రయత్నం అని అనిపిస్తుంది. తన దగ్గరకు వచ్చిన వారిని భగవంతుని దగ్గరకు చేర్చుట, అందరిలో భగవంతుని చూడడం సార్ నైజం.  అట్టివారు భగవంతులే, వారి సన్నిధి అయస్కాంతం పక్కన ఉన్న ఇనుము అయస్కాంతంగా మారినట్లు వారి సన్నిధి ప్రభావమే మనల్ని ముందుకు నడిపిస్తుంది.

నాకు సాయిశివ వలన మరియు సత్సంగం వలన సార్ సన్నిధి స్వామి సన్నిధి కోల్పోకుండా ఉండేటట్లు అనగా వారే అన్ని రూపాల్లోనూ ఉండి నడిపిస్తారని సార్ ఉన్నప్పుడు వారి ప్రత్యక్ష సన్నిధి, సమాధి చెందిన తర్వాత కూడా తన సంస్కారాన్ని బట్టి అనేక రూపాలలో తనను నడిపిస్తున్నారని అంటే గురు కృప ఎప్పుడూ ఉంది అని గుర్తుంచుకోవడం ముఖ్యం. సార్ ఇంతకుముందు, ఇప్పుడు ఇతర రూపాలలో తనును నడిపిస్తుంది, సార్ ఆనంద స్వరూపమని చెబుతూ సార్ యొక్క

సర్వాంతర్యామిత్వాన్ని నిదర్శనంగా ఈ సన్నివేశాన్ని చెబుతున్నారు. తన సోదరుడు సాయి సుబ్రహ్మణ్యం సార్ కి పరోపకారానికి వినియోగించమని వారి చేతికి డబ్బులు ఇచ్చేవాడు. అది చూసి తన మనసులో సార్ మర్చిపోతే ఆ డబ్బులు సార్ వద్ద ఉండిపోతాయని అనుకుంటుండగా, సార్ కు తెలియందేముంది అరచేతిలో ఉసిరికాయ లాగా మన మనసులు తెరిచిన పుస్తకం, సార్ వెంటనే “సాయి! నాకెందుకయ్యా నాకు ఇస్తే నేను మర్చిపోతాను. నీవే ఆ హుండీలో వేసేయ్” అన్నారు. కాబట్టి మనం కూడా ఆ ఆనంద స్వరూపాన్ని అనుభవించడానికి నాది నేను అనే అహంకారాన్ని, అడ్డుగోడును తొలగించుకోవాలని ముగించారు.

**ఓం శ్రీ సాయిరామ్! ఓం నారాయణ ఆది నారాయణ!**

అంజలి గారు, వారి తల్లి గారు అవధూత లీల ను తెలుగు నుండి కన్నడంకు తర్జుమా చేశారు. ఆమె తమకు స్వామితో గల అనుబంధాన్ని ఇలా వివరిస్తున్నారు.

నమస్తే!

నా పేరు **అంజలి**. నేను కన్నడ మాట్లాడే కుటుంబంలో జన్మించాను. నేను 1996 నుండి **న్యూజెర్సీ**లో నివసిస్తున్నాను. మా ఇంటికి కేవలం 5 మైళ్ళ దూరంలో శ్రీ మురళీకృష్ణ చివుకుల గారు శ్రీ సాయి, వెంకయ్య స్వామి

వారి ఆలయం ప్రారంభించినప్పుడు నాకు వెంకయ్య స్వామి వారి గురించి మొదటిసారిగా తెలిసింది.

ఆలయ ప్రారంభానికి ఒక రోజు ముందు, మే 12, 2021న, నేను మొదటిసారిగా సేవ చేయడానికి వెళ్ళినప్పుడు, అక్కడ వేదికపై రెండు చిత్రపటాలు చూశాను: ఒకటి షిర్డీ సాయిబాబా, మరొకటి వెంకయ్య స్వామి వారిది. నేను 1976 నుండి 1996 వరకు హైదరాబాద్‌లో నివసించినప్పటికీ, నాకు వెంకయ్య స్వామి వారి గురించి ఇంతకు ముందు ఎప్పుడూ తెలియదు.

నేను ఉదయం, సాయంత్రం ఆలయంలో స్వచ్ఛంద సేవ చేసేదాన్ని. ఆ సమయంలో, మురళి గారు వెంకయ్య స్వామి వారి కథలు, తన వ్యక్తిగత అనుభవాలు పంచుకునేవారు. అయితే, అప్పటికే షిర్డీ బాబాతో నా అనుబంధం చాలా బలంగా, లోతుగా ఉండేది. రోజులు గడిచే కొద్దీ ఆలయంలో అనేక సంఘటనలు జరిగాయి. నేను వెంకయ్య స్వామి వారి పట్ల తీవ్రమైన అయిష్టతను పెంచుకోవడం ప్రారంభించాను. ఆయన పట్ల తీవ్రమైన కోపం, ద్వేషం, అయిష్టత, భయం కూడా కలిగాయి. కానీ గురువులు నన్ను స్వచ్ఛంద సేవ ఆపడానికి అనుమతించలేదు—వారు నన్ను ప్రతిరోజూ ఆలయానికి రప్పించారు.

ఒకానొక సమయంలో, గురువు పట్ల అలాంటి భావాలను మోయడం నాకు చాలా భారంగా అనిపించింది. నేను ఆయన (స్వామి వారి) తత్వాన్ని అర్థం చేసుకోవడానికి సహాయం చేయమని స్వామి వారినే ప్రార్థించడం ప్రారంభించాను. సరిగ్గా ఒక వారం తరువాత, నా మాతృభాష అయిన కన్నడలోకి వెంకయ్య స్వామి వారి పుస్తకాన్ని అనువదించే అవకాశం నాకు లభించింది.

ఒక ఆదివారం సాయంత్రం, శ్రీ అశోక్ గారు ఆలయంలో ఉన్నారు. ఆయన వెళ్తున్నప్పుడు నేను ఫోన్‌లో కన్నడ మాట్లాడుతుండటం విన్నారు. ఆయన నన్ను పిలిచి, భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారి పుస్తకాన్ని కన్నడలోకి అనువదించడానికి ఇష్టపడతారా అని అడిగారు. కన్నడ నా మాతృభాష అయినప్పటికీ, నేను హైదరాబాద్‌లో చదువుకున్నందున తెలుగు చదవడం, రాయడం కొంచెం బాగా వచ్చని చెప్పాను. అదృష్టవశాత్తు, ఆ సమయంలో నా తల్లి శ్రీమతి పద్మస్వామి గారు న్యూజెర్సీలో నన్ను చూడడానికి వచ్చారు. ఈ అనువాద ప్రయాణంలో సహాయం చేస్తారేమోనని ఆమెను అడుగుతానని చెప్పాను. ఆమె వెంటనే అంగీకరించారు, అలా మేము అనువాదం ప్రారంభించాం.

ఆమె నవంబర్ 2023లో కన్నడ అనువాదాన్ని శ్రద్ధగా చేతితో రాయడం ప్రారంభించారు. ఫిబ్రవరి 2024 చివరి నాటికి మొదటి

ముసాయిదాను పూర్తి చేశారు. నా పని దానిని సవరించడం, కన్నడలో టైప్ చేయడం. ప్రతి అధ్యాయంతో, వెంకయ్య స్వామి వారి గురించి నా అవగాహన మరింత లోతుగా మారింది. అది ఎంతటి ఆశీర్వాదం!

అనువాదం పూర్తయ్యాక, ముద్రిత పుస్తకంలో తన పేరు ప్రచురించవద్దని నా తల్లి స్పష్టంగా సూచించారు. నేను ఆమె కోరికను గౌరవించి నా పేరు లేదా ఆమె పేరు ఇవ్వడానికి నిరాకరించాను. అయితే, అశోక్ గారు నన్ను ఒప్పించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు.

జూన్ 16న, నా తల్లికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి బెంగుళూరులోని ఐసీయూలో చేర్చబడ్డారు. ఆమెను చూసుకోవడానికి నేను ఇండియా వచ్చాను. జూన్ 28న, ఆమెకు తీవ్రమైన మూర్ఛ వచ్చి మళ్ళీ ఐసీయూలో చేర్చబడ్డారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఒక రోజు, ఆమె స్పందించడం మానేశారని, ఇక ప్రకృతిని దాని పని చేయనివ్వాలని వైద్యులు చెప్పారు.

ఆ సమయంలో, అశోక్ గారు మళ్ళీ ఫోన్ చేసి, అమ్మ పేరు అడిగారు. ఆయన గొలగమూడిలోని తన పరిచయస్తుల నుండి వచ్చిన సందేశాన్ని కూడా పంచుకున్నారు. నేను బాబా, స్వామి వారికి ప్రార్థనలో లీనమయ్యాను. ప్రార్థించిన తర్వాత, నా తల్లి పేరు పంపాను.

సరిగ్గా 10 నిమిషాల తరువాత, నాకు వెంకయ్య స్వామి వారి దర్శనం లభించింది. నా తల్లి మెదడుకు కుడి వైపున ఒక పెద్ద, దివ్యమైన తెల్లని కాంతి వ్యాపించింది. నవ్వుతూ, వెంకయ్య స్వామి వారు గాలిలో ఎగిరి, ఆ తెల్లని కాంతిపై వాలారు. సరిగ్గా అరగంట తరువాత, నా తల్లి స్పందించడం ప్రారంభించారు. ఒక్క రోజులోనే ఆమెను ఐసీయూ నుండి సాధారణ వార్డుకు మార్చారు.

ఆ తరువాత కొన్ని సమస్యలు వచ్చాయి, కానీ వెంకయ్య స్వామి వారు అమ్మను చూసుకుంటున్నారు. ఆగస్టు 11న ఆమె ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పుడు ఇంటికి వచ్చి కోలుకుంటున్నారు. నేను ఇప్పుడు అవధూత యొక్క అపారమైన శక్తిని అనుభవించాను.

ఈ అందమైన, దివ్యమైన అవకాశాన్ని నాకు అందించిన గొప్ప గురువులకు నా శాశ్వత కృతజ్ఞతలు. ఈ అనువాదం, సవరణ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ నేను నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయకపోతే స్వామివారు సంతోషించరు:

శ్రీ అశోక్ గారు, నన్ను ఈ గొప్ప పనికి ఎంపిక చేసుకుని, ప్రతి అడుగులో నాకు మద్దతుగా నిలిచారు. నాకు తెలుగు బాగా వచ్చని నేను నమ్మినప్పటికీ, ఈ పుస్తకం అందుకు విరుద్ధంగా ఉంది—ముఖ్యంగా నెల్లూరు మాండలికంలో ఉన్నందున నాకు చాలా పదాలు తెలియవు. అశోక్

గారు చాలా ఓపికతో ఉన్నారు. నేను అర్ధరాత్రి ఫోన్ చేసినప్పుడు కూడా నాకు అర్థం చేసుకోవడానికి ఎప్పుడూ సహాయం చేశారు.

నా తల్లి, అనువాదాన్ని చక్కగా చేతితో రాసి, మొదటి ముసాయిదాను నాకు అందించారు.

బెంగుళూరులో నివసించే నా కజిన్ శ్రీ రవిశంకర్, కన్నడ పండితుల కుటుంబం నుండి వచ్చారు, ప్రూఫ్‌రీడింగ్, చివరి సవరణలలో సహాయం చేశారు.

వినయపూర్వక నమస్కారాలతో,

అంజలి

## సార్ సత్సంగ గానం

**భక్తినీయుమయ్యా - వసద్ది చెయ్యవయ్యా.. -** **సాయి శివ**

రేయీ-పగలూ నీ నామంబును ఎట్లా స్మరియింతూ?..,

నిన్నెట్లా గుర్తింతూ?...,

మంత్రము-తంత్రము తెలియదు నాకు, భక్తినీయుమయ్యా...,


వసద్ది* చెయ్యవయ్యా..


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

---

సత్యవాక్కులు - ధర్మనిష్ఠయు, నా చెంతనలేవు.. ,

సంపన్నత్వము-సాధారణత్వము తెలియదు నాకసలు. .

పోగొట్టవయా కాఠిన్యమునూ, నా మాటలలో...,

సరిదిద్దుమయా త్రికరణములనూ, నీ సేవలతో...🙏

కుక్కపిల్లలా తిరుగుదుగాకా నీ భక్తుల చుట్టూ..,

మీ మధుర వాక్కులింటూ...🙏

భ్రమరము కాదా? కీటకమైనను!! నిధి-ధ్యాసలచే...

భయభక్తులతో..

వినిపించవయా నీ ఝుంకారమును, లోన-బయలూ, రేయి-పగలూ 🙏

తీర్చవయా నా తాపమును, నీ సన్నిధిలో... నీప్రార్థనతో....🙏🙏

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

* "వసద్ధి చేసుకొంటే రెండక్షరాలు చాలయ్య", అని శ్రీ వెంకయ్య స్వామి వారు ఒకరోజు రోశిరెడ్డి తో అన్నారు. వసద్ధి చేసుకోవడ మంటే సాధన ద్వారా మనలోని రాగద్వేషములు, రాజస, తామస గుణములు నిర్మూలించుకొని దైవీ సంపదలో నెలకొంటే ఏ మంత్రంతో నైనా తరించవచ్చని శ్రీ స్వామి వారి భావము.

- అవధూత లీల.



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

# శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

OM

గొలగమూడి

01-06-05

Dear Sai!

“కష్టముల యందు ధైర్యము. అంతులేని ఓర్పు” గురుసేవకు ఉండవలసిన ముఖ్య గుణాలంటారు, ఒక మహనీయుడు.

లక్ష్మక్క గారికి నమస్కారములు.

ఈ చెడ్డ కాలంలో మన ప్రారబ్ధం ఎంత చక్కగా, గొప్పగా కడిగివేయబడుతుందో యోచించండి. ఉపాసనీ బాబాను ఎంతగా కష్టాలకు గురి చేశారో యోచించండి. గుడ్డలే లేకుండా దిగంబరంగా ఉండాలి. ఎంత ఆకలిగా ఉన్నా ఎవరిని ఏమీ అడగకూడదు. ఎవరైనా పెడితేనే తినాలి. ఈ పరిస్థితికి మనం ఒక్క క్షణం తట్టుకోగలమా? ఒక ప్రక్క నానావల్లి చేత దెబ్బలు, గుంటలో కూర్చుంటే అక్కడే అన్నం తినమంటాడు, తింటే కొడతాడు. తినకుంటే కొడతాడు. చెక్కుచెదరని ధైర్యంతో ఉన్నారు. శ్రీ స్వామి వారు మన మంచి కొరకే పెడుతున్నారనే ఎరుక మరువ వద్దు.

శ్రీ స్వామివారి ఆశీస్సులు


పెసల సుబ్బరామయ్య


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాష్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

********* సద్గురు దేవా శరణం శరణం *********

OM

గొలగమూడి

02-06-05

Dear Sai!

పూజ్య గురు బంధువులు శ్రీమతి లక్ష్మక్క గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు. ఇంద్రియములను జయించమన్నారు. అంటే నిజంగా అర్థం ఏమిటో తెలుసుకొని నడవాలి. తీపి తినకూడదని అనుకుంటే, కఠినంగా ఉంటే శరీర అవసరాలు ఏం కావాలి? "శరీరం పాడుది, మలమూత్ర కొంప" అని లక్షలు చెప్పినా ఈ శరీరమే కదా మనం తరించే మార్గానికి పడవ. భగవదనుభూతి ఎలా పొందగలము? శరీరం ఉండాలి కదా!

స్వామివారు చూచి నేర్చుకోమన్నారు. లడ్డు పెట్టినా, మిఠాయి పెట్టినా వద్దు అనరు. కానీ మిరప్పొడి పచ్చడి కలిపి నాలుకకు దాని రుచి తెలియకుండా తినేవారు. చివరి వరకు చక్కెర కలిపిన పాలు, బిస్కెట్ పొడి గల జావ త్రాగేవారు. అందులోకి నంచుకునేవారు. వారా శరీరాన్ని ఎంతో జాగ్రత్తగానే చూచుకున్నారు. కానీ ఇంద్రియలోత్వం దరి చేరనీయలేదు. 30 సంవత్సరాలైనా నేటికీ వారి ఆజ్ఞలనే పాటించని నాకు, వారి మార్గం ఏమి

తెలుస్తుంది? ఏమి పాటించలేదు? నాకు తెలుస్తుంది! లోకానికి ఎలా తెలుస్తుంది? ఇంద్రియములలో చరించే మానవుని మనోసామర్థ్యం హరించబడును. ఎలాగూ? గాలిచే పడవ వేగము హరించబడినట్లు. కనుక శరీర అవసరాలు చూసుకుంటూ, ఇంద్రియాలు లేకుండా ఈ పడవను నడపాలి. వాతం చేరుతోందని తెల్లగడ్డలు అన్నంలో ఉడికించి తిన్నాను. అది జిహ్వాచాపల్యమై ఒక గడ్డంతా వేయసాగాను. శరీరంలో వేడి ఎక్కువై తలలో గడ్డ లేచింది. ఎన్నిసార్లు చెప్పినా అలోలత్వం, మార్థవం, హీరచాపలం అనేవి ఎవరికి వారే నేర్చుకోవాలి. కానీ ఒకరు చెప్పి చేయించలేరు. కేవలం ప్రతి దానికి డాక్టర్ మీద ఆధారపడకూడదు. అసలే డాక్టర్ను కలవకుండా ఉండలేము. కారణం మనం సంపూర్ణ శరణాగతిని చెందలేదు. బుద్ధుడు, శ్రీ స్వామి బాబాలు కూడా మందులు వాడారు. సొంటి, సోనాముఖి కూడా మందులే కదా! కనుక మన పడవ మనం నడిపే విద్య ఎవరికి వారు నేర్చుకోవాలి.

శ్రీ స్వామివారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

OM

గొలగమూడి

15-06-05

Dear Sai!

మనకు గురువుగారు ఒక పని ఒప్ప చెప్పాక అటు, ఇటు చూడకుండా ఆ పని మీదనే మనసు లగ్నం చేయాలి. విద్యానగర్ మందిరానికి క్యూరింగ్ కు నీరు పోస్తున్నాము. అప్పుడప్పుడు మాస్టర్ గారు మందిరం దగ్గరకు వచ్చేవారు. అంతా వారికి ఎదురేగి నమస్కారాలు చెప్పేవారు. నేను మాత్రం నా పనిలో నేనుంటాను. వారే వచ్చి పలకరించి పోయేవారు. నేను ఆరతులకు పోయే తీరిక ఉండదు. రాత్రి 9 గంటల పైన అందరూ అన్నం తిని పోయాక గిన్నెలన్నీ కడుక్కొని అప్పుడు మాస్టారు దగ్గరకు వెళ్లేవాడిని. ఒకటి రెండు మాటలతో వెళ్లి పడుకోమని చెప్పేవారు. కనుక నీవు కూడా ఆదివారం బాగా సద్వినియోగం చేసుకొని స్వామి కృప పొందాలని కోరుతున్నాను. శ్రీ స్వామివారి కృప సదా నీకు ఉండాలని ప్రార్థిస్తూ

పెసల సుబ్బరామయ్య

శ్రీ సద్గురు దేవా శరణం శరణం

OM

గొలగమూడి

16-06-05

Dear Sai!

మాస్టారు రాసిన శ్రీ సాయి ప్రబోధామృతంలో 36వ పేజీలో “.. ఇలాంటి యజ్ఞ, దాన, తపః కర్మలతో నిండి ఉన్న జీవితమే యజ్ఞము” అని వ్రాశారు. “కర్మ కూడా యజ్ఞమే” అంటారు. యజ్ఞమును పెద్దలు ఇలా నిర్వచించారు. నిత్యము క్రమం తప్పకుండా చేసే ఏ పనైనా యజ్ఞం అంటారు. చదువు కూడా యజ్ఞమే! అదే తపస్సు. ఈ తపస్సు ద్వారా నీవు దేశానికి అందించే Thesis దానమవుతుంది. నీవు చేసే కృషి నీకు ఒక్కడికే కాదు. భవిష్యత్తులో ఎన్నో కోట్ల మందికి ఉపయోగపడుతుంది. అలాంటి కృషి చేసేందుకు మనం సిద్ధం అవ్వాలే కానీ శ్రీ స్వామివారు మనకు నిరంతరం చేయుత నిచ్చి నడిపిస్తారు.  అదే మన ప్రార్థన.

పెసల సుబ్బరామయ్య

శ్రీ సద్గురు దేవా శరణం శరణం

OM

గొలగమూడి

18-06-05

Dear Sai!

సాయి చెప్పిన మంచి వేదవాక్కు. ఏ పని చేయడానికి అంగీకరిస్తావో ఆ పని క్షుణ్ణంగా చెయ్యి. లేకుంటే అంగీకరించకు. క్షుణ్ణంగా చేసేందుకు కావలసిన ఏర్పాట్లు అన్నీ మనమే చేసుకోవాలి. శరీర కండిషన్ మనమే చక్కగా నడుపుకోవాలి. ఏమి తింటే ఎలా ఉంటుందో చూస్తుండాలి. శ్రీ స్వామివారి కృప సదా మీకు ఉండాలని ప్రార్థిస్తూ

మీ

పెసల సుబ్బరామయ్య


*********** సద్గురు దేవా శరణం శరణం ***********


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

# సార్ సత్సంగం

## సద్గురువును ఆశ్రయించడం అంటే?

**23:43 onwards**

విషయాసక్తుడు. విషయాలంటే? భరద్వాజ మాస్టర్ గారు అమ్మగారి మంచం ఎక్కిందాకా కిందనే పడుకునేవారు. అమ్మగారు మంచం ఎక్కకు ముందు కూడా ఇద్దరూ చాప వేసుకుని పడుకునేవారు. తర్వాత అమ్మగారు మంచం ఎక్కినామైన, ఇంక ఆమె “ఏమిటండి? మీరు క్రింద, నేను పైన ఏంటండీ? మీరు మంచం మీద పడుకోండి” అంటే, అప్పుడు ఆయన కూడా మంచం ఎక్కినారు. అంటే నాకు సుఖంగా ఉండాలా! కంఫర్టబుల్ బెడ్ ఉండాలా! అదేదో పిల్లో కవర్ ఉండాలా! ఇవన్నీ ఏమీ లేవు. విషవాంఛాయుక్తుడు, విషయ వాంఛలు అంటే “కడ్డీలు మంచివే ఉండాలా, ఘుమఘుమ ఘుమ వాసన కొట్టాలి” అంట. నేనొక మొండి ముండాకొడుకుని. అమ్మ! దేవుడు పీల్చేదానికా? మనం పిలిచేదానికా కడ్డీలు? దేవుడు పిలుస్తాడంట, మంచి కడ్డీలు వెలిగించాల! ఆయన ముండాకొడకా! నీ మనసును నాకు కొంచెంసేపు ఇవ్వరా! అని ఆయన చెప్తుంటే ఘుమఘుమలాడ లేదట. భరద్వాజ మాస్టర్ గారు ఒకసారి చెప్పాడు అయ్యా! లేకపోతే అవి నేను అట్లా మొండిగా పట్టుకోనమ్మ! కడ్డీలు పెట్టడం ఏమిటంటే అగ్నిని పెట్టడం అంట. అగ్ని గురువుకు

సమానం అంట. గురువుకు ప్రతిరూపంగా అగ్నిని పెట్టుకుంటామట. అక్కడ గురువు సమాధి చెందుతూ అగ్ని ఇస్తాడట శిష్యుడికి. మనం దానిని సంరక్షిస్తూ ఉండాలి. మనం ఎక్కడ పొద్దస్తాం పట్టుకు తిరుగుతాం! సంసారంలో ఉండే వాడికి, అగ్నిని పెట్టుకుని ఎలా తిరుగుతాడు? వెంకయ్య స్వామి మోకు వెలిగించినట్లు పోతామా మనం? పోలేం! ఇంట్లోనే అగ్నిగుండం పెట్టుకుంటామా? అదీ పెట్టుకోలేము. కనుక కనీసం నమస్కారం పెట్టుకునేటప్పుడు అన్నా అక్కడ అగ్నిని పెట్టు, కడ్డీని వెలిగించి. ఇంకా అగ్ని కావాలంటే నువ్వు దీపారాధన కూడా చేయమంటారు. ఆ కడ్డీలు ఎందుకు అంటే, అక్కడ అగ్నిని పెట్టుకోవడం, నువ్వు కూర్చున్నంత సేపు, దండం పెట్టినంత సేపు ఆయన ఆ రూపంలో అక్కడ ఉన్నారని చెప్పే దానికి అది గుర్తంట. విషయ వాంఛాసక్తుడు, కనుక మనిషి పరమౌలౌకికుడు అని శ్రీస్వామి వారి భావము. కనుక మనం ఇప్పుడు దీక్షా సమయంలో కానీ, ఇతర సమయంలో కానీ శ్రీ స్వామి వారిని ఎలా సేవిస్తే వారి సంప్రీతులు అవుతారో గుర్తించుకోవలసి ఉన్నది.

**ఎన్ని మాట్లు చేసావ్ పారాయణ?** 50 మాట్లు చేసినా… ఈ పేరాగ్రాఫ్ ఎప్పుడు చదివినారమ్మ? చదివితే గుర్తుందా అమ్మ? నాకు ఉండి చచ్చిందట్లే! ఈ రోజు నేను చదువుతుంటే, ఆ మైనే అండర్లైన్ చేసి, ఈడ రాసి పెట్టుకున్నా! నేనొక నియమం పెట్టుకున్నాను, అమ్మ. ఈ పుస్తకాలు వారం

రోజుల్లో చదవడం నాకలవి కాదు. నా గొడవలు నాకు ఉన్నాయి. రోజూ కనీసం రెండు పేజీలన్నా పూర్తి చేయాలా. కూడు తినబోయే ముందు చదవాల. ఇంకెప్పుడు చదివేది దీన్ని అని, (మా వాళ్లతో) ప్రతి రోజు పెట్టాలి నువ్వు, ఆ పుస్తకం నేను వచ్చేసరికి, పీఠ మీద రెడీగా! (అలా) పెట్టి ఉంటుంది కవర్ తో కూడా. ఇంకా ఆ పుస్తకం తీస్తే కదా, కూర్చునేది? దానిమీద, కూర్చుంటాము. ఓహో పుస్తకం చదవాల. ఆమె గాని పుస్తకం కానీ పెట్టలేదు, అంటే వెంటనే లగాయిస్తా! ఆమె వస్తుంది, ఏంటయ్యా! పుస్తకం పట్టకుండానే తింటున్నావు! అరెరే మర్చిపోయినా అని చేయి కడుక్కుంటా. ఇట్లా తీసుకురా పుస్తకం, అంట. శ్రీ స్వామిని ఎలా సేవిస్తే వారు సంప్రీతులు అవుతారో తెలుస్తుంది శ్రద్ధగా (అలా అండర్లైన్ చేసుకు, వ్రాసుకొంటూ) చదివితే.

ఇతరులను గూర్చి దుర్విమర్శలు చేయుట, దీక్ష సమయంలో! స్వామి కాడికి వచ్చినాము! ఊసుపోని రాజకీయమును చర్చించుట. ఎన్ని మాట్లో చదివి ఉంటారు? అట్లా పోయి పేపర్లు పట్టుకొని ఆమె ఎవరో చచ్చింది, ఈమె ఎవరో చచ్చింది. ఎవరో వాళ్ళ తాళ్లు, వాళ్ళు ఏడ తెంచుకున్నా పరవాలే! ఎంతో బాధతో వచ్చిన వాళ్ళు ఉంటుంటారు. ఎన్నో సమస్యలతో వచ్చిన వాళ్ళు ఉంటారు. వాళ్లు కూడా పుస్తకం చదువుతూనే ఉంటారు. ఏం చదువుతారో, ఏం పాడో!

**ఊసుపోని రాజకీయములు చర్చించుట, ఎప్పుడో ఎక్కడో జరిగిపోయిన విషయములను గూర్చి మననము చేయుట (వాడేదో చెబుతున్నాడు, వీడికి ఏదో గుర్తొస్తున్నది) మొదలగున్నవన్నీ.. (ఇంకా ఉన్నాయి అవన్నీ చెప్పలే ఇక్కడ). శ్రీ స్వామివారి దృష్టిలో మనకంటుకునే మలినాలే! అవన్నీ మనల్ని మైల పరుస్తాయట.** అవి అంటుకున్నాక ఎన్ని మార్లు నువ్వు స్నానం చేసినా, ఎన్నిమార్లు నువ్వు గుడ్డలిప్పి ఉతికిన గుడ్డలు (నువ్వు ఎన్ని మార్లైనా స్నానం చెయ్యి, సబ్బేసి రుద్ది రుద్ది రుద్ది) కట్టినా ఆ మైలు మనలను వదలదని శ్రీ స్వామి వారు తన ఆచరణ ద్వారా చూపించి బోధించారు.

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాధ్ మహారాజ్ కీ జై.**



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దగ్గాస్వామి

## మహాత్ముల వాక్యాలు

## మైత్రేయ మహర్షి బోధలు - బృందజీవనము

బృంద జీవనమునకు సహకారము, పరస్పర గౌరవము, ఏకాభిప్రాయము, సమిష్టి శ్రేయస్సు మూల స్తంభములు. ఈ నాలుగు అంశములూ ఎచ్చట ప్రకాశించుచుండునో అచ్చట బృందజీవనము (Group living) సహజీవనముగ సిద్ధించును. బృందమునకు ఒక నాయకుడున్నను, నిర్ణయములు సమిష్టిగా జరుగుట, సమిష్టి నిర్ణయమును నాయకుడు నిర్వహించుట శ్రేయస్కరము. తన తోటివారిని తనతో సమానముగా మన్నించి, గౌరవించి, సంప్రదించి, సమిష్టి నిర్ణయమును మాత్రమే నిర్వర్తించువాడు నిజమైన నాయకుడు. అధికారమును చూపువాడు సంస్కారవంతుడగు నాయకుడు కాడు. ఈ భావమునే రోమన్ రాజ్యాంగ విధానము అనుసరించినది. మరియు గ్రీకు దేశపు ద్రష్టలగు సోక్రటీసు, ప్లాటో ప్రతిపాదించిరి. సమత్వము, సమభావము నాయకుని ముఖ్య లక్షణములు. బృందమందలి సభ్యుల యందు పరస్పరత్వము ఒక కట్టు బాటు.

ఒకరినొకరు ఆదరించుట, సహాయపడుట, విమర్శించు కొనకుండుట పరస్పర ప్రేమానురాగములకు దారి తీయును. ఇది లేనిచో

బృందమొక మఠమగును. మఠములయందు యాంత్రిక దినచర్యయే కాని స్ఫూర్తి తరుగుచుండును. ఒకచోట ఉండినను, ఎవరికి వారుగా నుండుట, యాంత్రికముగ కలియుట, యాంత్రికముగ పూజలు చేయుట జరుగుచుండుట చేత కార్యక్రమములు యందు నిస్పృహ తాండవించుచుండును. స్ఫూర్తి అదృశ్యమగుచుండును. బృందములుగ జీవించుటకు చెప్పబడిన సూత్రములు నాలుగు. అవి ఎచ్చట నిర్వర్తింప బడుచున్నవో అచ్చట బృందజీవనము యొక్క రసానుభూతి కలుగును. కావున బృందజీవనము ఆశ్రమ జీవనమే కానక్కరలేదు. కుటుంబము నందేర్పరచు కొనవచ్చును. అన్ని రకముల సంస్థల యందు కూడా బృందజీవనము రసానుభూతి కలిగించును. ఈ సూత్రములతో నిర్వహింపబడు ఆధ్యాత్మిక సంస్థ కాని, ధార్మిక సంస్థ కాని, సాంఘిక సంస్థ కాని, వ్యాపార సంస్థ కాని మానవునకు స్ఫూర్తి, ఆనందము కలిగించుట తథ్యము.

🙏🏽

**------- సద్గురు దేవా శరణం శరణం --------**



**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు**